సాక్షి విశాఖపట్నం

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



దర్శనానికి వచ్చి ఉంగరం దొంగిలిస్తారా..? 8లో



రైల్వేస్టేషన్‌లో 'ఎకానమీ మీల్స్' 8లో



పలు రైళ్ల దారి మళ్లింపు, రీ షెడ్యూల్ 8లో

న్యూస్‌రీల్

మే 13న దుకాణాలు, సంస్థలకు సెలవు

- పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు
- కార్మిక శాఖ ఆదేశాలు ఉల్లంఘిస్తే జరిమానా

సీతంపేట: కార్మిక శాఖ ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం 1988 ప్రకారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరిగే మే 13న దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించినట్టు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆదూరి గణేశన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక లేదా ఏ ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు కార్మిక శాఖ ఆదేశాలను ఉల్లంఘించినట్టయితే జరిమానాతోపాటు శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ విషయమై కార్మిక శాఖ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారని గణేశన్ చెప్పారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

సీతంపేట: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ విభాగాల్లో పలువురిని నియమించారు. పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా జి.వి.కృష్ణారావు (గాజువాక), సంయుక్త కార్యదర్శిగా జి.ఎస్.వి.వి.కె.ఎ.ఎస్.రాజు(కిరణ్‌రాజు, విశాఖ ఉత్తర) నియమితులయ్యారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా పెంటపల్లి సత్యనారాయణ(దక్షిణ), సత్యాల సాగరిక(తూర్పు), కార్యదర్శులుగా అంగ వరహా సత్యనారాయణ(అంగ వర్మ, పశ్చిమ), ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దశమంతుల వేణుగోపాల్(దక్షిణ), మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేరుగుమాల శ్రీదేవి(దక్షిణ), కార్యదర్శులుగా మహమ్మద్ సబీరా బేగం(దక్షిణ), పప్పల సునీత(ఉత్తర)ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉప్పొంగిన ఉత్సాహం

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్
- తరలివచ్చిన అశేష జనవాహిని
- జైత్రయాత్రలా సాగిన ర్యాలీలు

అభిమాన నేతలకు మద్దతుగా ప్రజానీకం కదిలొచ్చింది. వారిని చట్టసభకు పంపేందుకు కదం తొక్కింది. జగన్ సంకల్పాన్ని నెరవేర్చేందుకు మేమంతా సిద్ధమంటూ నినదించింది. వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తూ విజయనాదం చేసింది. అశేష జనవాహిని వెంట రాగా వైఎస్సార్ సీపీ భీమిలి, విశాఖ తూర్పు, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా సాగింది. అదే సమయంలో టీడీపీ, జనసేన అభ్యర్థుల నామినేషన్లు వేయగా ప్రజా స్పందన కరువైంది. టీడీపీ, జనసేన అభ్యర్థులు అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి.. ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురి చేశారు.



ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ నేతలు

గాజువాకలో ప్రభం'జనం'



ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్. చిత్రంలో మంత్రి బొత్స

గాజువాక: వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ నామినేషన్ ర్యాలీతో రహదారులు జనసంద్రంగా మారాయి. నామినేషన్‌కు ముందు ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం నృసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తల్లి నాగమణి, భార్య హిమగౌరి, సోదరి సురేఖ తదితరులతో కలిసి అమర్‌నాథ్ మిందిలోని తన స్వగృహం నుంచి బయలుదేరి జింక్ గేటు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సహా వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో కలిసి రిటర్నింగ్ కార్యాలయానికి భారీ ర్యాలీతో చేరుకున్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డికి అమర్‌నాథ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను, ఆయన భార్య హిమగౌరి రెండు సెట్లను సమర్పించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, ఉరుకూటి అప్పారావు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అమర్

అమర్‌నాథ్ ఆస్తి రూ.7.7 కోట్లు

అమర్‌నాథ్ స్థిర, చరాస్తులు కలిపి మొత్తంగా రూ.7.7 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రెండు కార్లు ఉన్నాయి. విశాఖ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన నిరసనలకు సంబంధించి మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు.

'తూర్పు'న పోటెత్తారు

ఆరిలోవ: వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ నామినేషన్ ర్యాలీతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ దుర్గాబజార్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, విశాఖ కంటి ఆస్పత్రి, సిరిపురం కూడలి, పందిమెట్ట కూడలి మీదుగా జిల్లా పరిషత్ వరకు సాగింది. అక్కడ నుంచి ఎంవీవీ కలెక్టరేట్‌కు వెళ్లి తూర్పు ఆర్వో, జేసీ మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ర్యాలీలో ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

ఎంవీవీ ఆస్తులివీ..

ఎంవీవీ తన పేరుపై రూ.228,14,11,952 విలువ గల చరాస్తులు, రూ.69,86,39,800 విలువ చేసే స్థిరాస్తులు, తన భార్య పేరు మీద రూ.112,30,33,286 చరాస్తులు, రూ.11,00,50,000 స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎంవీవీ పేరిట అప్పులు, రుణాలు రూ.18,72,60,714, అతని భార్య పేరిట రూ.6,60,06497 ఉన్నట్లు వెల్లడించారు. ఎంవీవీకి మూడు కార్లు ఉన్నట్లు పేర్కొన్నారు.



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంవీవీ

భీమిలి.. జనసంద్రం



ఆర్వోకి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ముత్తంశెట్టి, చిత్రంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తదితరులు



మధురవాడ నుంచి ర్యాలీగా వెళ్తున్న అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

తగరపువలస: వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్ అశేష జనవాహిని మధ్య కోలాహలంగా సాగింది. ముందుగా సింహాచలంలో సతీమణి జ్ఞానేశ్వరి, కుమారుడు శివనందీష్, కుమార్తె డాక్టర్ ప్రియాంక, అల్లుడు శ్రవణ్ కుమార్‌లతో కలిసి నామినేషన్ పత్రాలకు ఆయన పూజలు చేయించి పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అక్కడ నుంచి ఆరిలోవ మీదుగా మధురవాడ రాగా.. అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ద్విచక్రవాహనాలు, కార్ల ర్యాలీలో సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయానికి చేరుకున్నారు. అమ్మవార్ల దర్శనాల అనంతరం తగరపువలస మీదుగా భీమిలి బీచ్ వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పి.బాలరాజు తదితరులు అభిమానులనుద్దేశించి మాట్లాడారు. తర్వాత ఊరేగింపుగా భీమిలి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు వెంట రాగా భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

ముత్తంశెట్టిపై ఎటువంటి కేసులు లేవు

ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై ఎటువంటి కేసులు లేవు. ముత్తంశెట్టి తన పేరిట చరాస్తులు రూ.5,45,89,481, భార్య జ్ఞానేశ్వరి పేరిట రూ.4,78,86,699, హిందూ అవిభక్త కుటుంబం పేరిట రూ.2,15,000 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మార్కెట్ విలువ ప్రకారం స్థిరాస్తులు తన పేరిట రూ.12,24,00,250, తన భార్య పేరిట రూ.18,42,53,250 ఉన్నట్లు తెలిపారు. తన పేరిట రూ.63,32,141, తన భార్య పేరిట రూ.50,00,000 అప్పులు ఉన్నట్లు వెల్లడించారు.

ఏడో రోజు.. అదే జోరు

- విశాఖ పార్లమెంట్‌కు 8 నామినేషన్లు
- ఏడు అసెంబ్లీ స్థానాలకు 44 నామినేషన్ల దాఖలు
- నామినేషన్ల దాఖలుకు నేడే చివరి రోజు

మహారాణిపేట: జిల్లాలో నామినేషన్ల కోలాహలం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయడానికి గురువారం చివరి రోజు. దీంతో బుధవారం అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. విశాఖ పార్లమెంట్ స్థానానికి ఏడో రోజు ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ నుంచి మెట్ట రామారావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి కొంగరాపు గణపతి, స్వతంత్ర అభ్యర్థులుగా కర్రి వేణుమాధవ్, గాదం అప్పల నరసింహ ఆనంద్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి మురపాల అచ్యుత కిరణ్ బాలాజీ, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ నుంచి వాండ్రాసి నాగ సత్యనారాయణ, బ్లూ ఇండియా పార్టీ తరఫున మురాల అరుణ శ్రీ, జై మహాభారత్ పార్టీ నుంచి గణపతి జగదీశ్వరరావు నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను ఆర్వో, కలెక్టర్ మల్లికార్జున తన కార్యాలయంలో స్వీకరించారు. బహుజన సమాజ్ వాదీ పార్టీ నుంచి పెదపెంకి శివప్రసాద్, భారతీయ రాష్ట్రీయ దళ్ నుంచి గుంటు దుర్గాప్రసాద్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పాలమరశెట్టి సత్యవతి, సమాజ్ వాదీ పార్టీ నుంచి జాలాది విజయ కుమారి, వైఎస్సార్ సీపీ నుంచి బొత్స ఝాన్సీలక్ష్మి, బొత్స అనూష తరఫున కోలా గురువులు బుధవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు...

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 44 నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులు 63 సెట్ల పత్రాలను ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. తూర్పు నియోజకవర్గంలో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఇ.హైమావతి ఓ సెట్, వైఎస్సార్ సీపీ నుంచి ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ(ఎంవీవీ సత్యనారాయణ) రెండు సెట్లు, ముళ్లపూడి నాగజ్యోతి రెండు సెట్లు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి డాక్టర్ గణపతి కొంగరపు ఓ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా బర్ల అప్పల పద్మాకర్ ఓ సెట్, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఇ.పీటర్ జోసెఫ్ ఓ సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి గుత్తుల శ్రీనివాసరావు ఓ సెట్, గుత్తుల మోనిక ఓ సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకి సమర్పించారు.

- భీమిలిలో స్వతంత్ర అభ్యర్థిగా నూకల సూర్యప్రకాశ్ ఓ సెట్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి ఎల్లిపిల్లి అనిల్ కుమార్ ఓ సెట్, ప్రజా ప్రస్థానం నుంచి దాసరి లక్ష్మీ సంధ్య ఓ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఏలూరు ధర్మావతి ఓ సెట్, వైఎస్సార్ సీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నాలుగు సెట్లు, ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి రెండు సెట్లు, టీడీపీ నుంచి గంటా శ్రీనివాసరావు ఓ సెట్, సమాజ్ వాదీ పార్టీ నుంచి చోడిపల్లి రాజు ఓ సెట్ ఆర్వోకి అందజేశారు.
- ఉత్తరంలో వైఎస్సార్ సీపీ నుంచి కమ్మిల కన్నప రాజు(కె.కె.రాజు) రెండు సెట్లు, కమ్మిల సుమ, స్వతంత్ర అభ్యర్థులుగా చింతల మల్లికార్జునరావు, వడ్డి శిరీష, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి కందుల బాలాజీ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు ఆర్వోలకు అందించారు.
- దక్షిణంలో జనసేన నుంచి సీహెచ్ వంశీకృష్ణ రెండు సెట్లు, చెన్నుబోయిన పద్మజ ఓ సెట్, వైఎస్సార్ సీపీ నుంచి వాసుపల్లి ఉషారాణి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా బి.రోహిత్ కుమార్ జైన్ ఓ సెట్, బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము రెండు సెట్లు, భారతీయ రాష్ట్రీయ దళ్ గుంటు దుర్గాప్రసాద్ ఓ సెట్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి బురు శ్రీనివాసరావు ఓ సెట్ పత్రాలు సమర్పించారు.
- పెందుర్తిలో బహుజన్ సమాజ్ పార్టీ నుంచి బంగరి రమణ, స్వతంత్ర అభ్యర్థిగా వద్దాది ఉదయ్ కుమార్ ఒక్కో సెట్, జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు మూడు సెట్లు, పంచకర్ల వెంకటేశ్వరరావు ఓ సెట్, పంచకర్ల మహాలక్ష్మి ఓ సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు.
- గాజువాకలో స్వతంత్ర అభ్యర్థినిగా గవర రోహిణి కుమారి ఓ సెట్, లోక్ తాంత్రిక్ జనతా పార్టీ నుంచి తోట అక్కయ్య రెండు సెట్లు, వైఎస్సార్ సీపీ నుంచి గుడివాడ అమర్‌నాథ్ రెండు సెట్లు, హిమగౌరి రెండు సెట్లు, టీడీపీ నుంచి పల్లా శ్రీనివాసరావు మూడు సెట్లు సమర్పించారు.
- పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి ఆడారి మాలతి ఓ సెట్, టీడీపీ నుంచి గణబాబు మూడు సెట్లు, పెతకంశెట్టి మౌర్య సింహ ఓ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా పిల్లా రమాకుమారి ఓ సెట్, సమాజ్ వాదీ పార్టీ నుంచి వెలగాడ రవికుమార్ ఓ సెట్, స్వతంత్ర అభ్యర్థినిగా జమ్మి పార్వతీ ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకి అందించారు.

భీమిలి అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

తగరపువలస : భీమిలి నియోజకవర్గం అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని, సీఎం ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సేవలందించారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ముత్తంశెట్టి నామినేషన్ సందర్భంగా బుధవారం ఆయన భీమిలిలో మాట్లాడారు. భీమిలి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైఎస్సార్‌సీపీ తరఫున అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ముత్తంశెట్టి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు.కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలను ఆదుకున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా నిరంతరం ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి ముత్తంశెట్టి అన్నారు. నియోజకవర్గంలో రూ.2 వేల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు, రూ.2,500 కోట్ల సంక్షేమ పథకాలు, 35 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో 175 నియోజకవర్గాలు తమ అభ్యర్థులే గెలుచుకుని తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయి విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపులో భాగస్వాములు కండి

- మాజీ కార్పొరేటర్లకు మంత్రి బొత్స పిలుపు
- ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే సీఎం జగన్ నిర్ణయాలు



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు చారిత్రక అవసరమని, దీంట్లో మాజీ కార్పొరేటర్లంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి, ఆకాంక్షలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి కొలువుదీరాలన్నారు. బుధవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ క్యాంపు కార్యాలయంలో ఆయన జీవీఎంసీ మాజీ కార్పొరేటర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్లు పీఎల్ఎన్ పట్నాయక్, రవిరాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఏడుగురు ముఖ్యమంత్రుల పనితీరును దగ్గర నుంచి చూశానన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారందరి కంటే భిన్నమైన వ్యక్తని అన్నారు. ఆయన ప్రజల కోసం కష్టపడే వ్యక్తి అని, ప్రతి నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా ఉంటుందని బొత్స కొనియాడారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ప్రధానంగా విద్యా వ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, పాఠశాల స్థాయి నుంచి టోఫెల్ స్పీకింగ్ విధానంపై దృష్టిసారించడం, నేడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, ఉన్నత విద్యలో పెద్ద ఎత్తున మార్పులు వంటి ఉన్నాయన్నారు. జగన్ నాయకత్వంలో మంత్రిగా సేవలు అందించడంపై బొత్స ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలవకపోతే తీవ్రంగా నష్టపోయేది రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలేనన్నారు. అలా జరగకుండా రాష్ట్ర ప్రజలతో పాటు రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు నడింపల్లి కృష్ణంరాజు, బోధిలపాటి ఉమామహేశ్వరరావు, కలిదిండి బద్రినాథ్, ముప్పల పోలారావు, అప్పారావు, సాయిలక్ష్మి, అమ్మాజీ, పోతురాజు, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో అడుగడుగునా కోడ్ ఉల్లంఘన


నామినేషన్ అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గణబాబు

కంచరపాలెం : విశాఖ పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు నామినేషన్ల సమయంలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారు. జోన్–5 జోనల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన తరువాత కొద్ది దూరంలోనే బీఆర్‌టీఎస్ రహదారిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార రథంపై నుంచే చాలాసేపు మాట్లాడారు. ఇలా ప్రచారం నిర్వహించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమే అయినా అక్కడ పోలీసులు చోద్యం చూశారే తప్ప అడ్డు చెప్పలేదు. గణబాబు కోడ్ ఉల్లంఘించి రహదారి మధ్యలో మాట్లాడుతుంటే కంచరపాలెం పోలీసులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఆలింగనం చేసుకునే పనిలో ఉండడం విమర్శలకు తావిస్తోంది. అలాగే గణబాబు, ఎంపీ అభ్యర్థి భరత్‌కు గజమాల వేసేందుకు మర్రిపాలెం రోడ్డుపై భారీ క్రేన్ ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రజాప్రస్థానం అంబులెన్స్‌లు, మరో ఆస్పత్రి అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ర్యాలీలో గోపాలపట్నంలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన(డీడీయు–జీకేవై) కేంద్రంలో శిక్షణకు వచ్చిన యువతులతో డ్యాన్సులు చేయించడంపైన ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పెందుర్తిలో జనసేన కార్యకర్తల హల్‌చల్


పెందుర్తి కూడలి వద్ద అనుమతి లేకుండా జనసేన ఏర్పాటు చేసిన బెలూన్లు

పెందుర్తి: పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు బుధవారం నామినేషన్ వేసిన సందర్భంలో జనసేన కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు పెందుర్తి ఆర్‌వో కేంద్రం వైపు గోడ దూకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అక్కడ ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టారు. ప్రచారంలో కూడా జనసేన నాయకులు నిబంధనలు అతిక్రమించారు. పెందుర్తి కూడలి వద్ద అనుమతి లేకుండా రెండు బెలూన్లు ఏర్పాటు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎంసీసీ టీం హెడ్ రవికుమార్ తెలిపారు. అలాగే అనుమతి తీసుకున్న వాటి కంటే ఎక్కువ వాహనాలు రావడంతో దానిపై కూడా ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు. మరో వైపు నామినేషన్‌కు వచ్చిన వారికి మందు, బిర్యానీ, రూ.300 ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మధ్యాహ్నం పెందుర్తి ప్రాంతంలోని బార్లు, మద్యం దుకాణాలు జనసైనికులతో నిండిపోయాయి.

మహిళల పాలిట రాక్షసుడు చంద్రబాబు

- టీడీపీ ఎగ్గొట్టిన రూ.25,500 కోట్ల డ్వాక్రా రుణమాఫీని జగనన్న చేశారు..
- బాబు సూపర్ సిక్స్‌లో ఇప్పటికే 3 పథకాల అమలు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్ రోడ్డు: టీడీపీ అధినేత చంద్రబాబు మహిళల పాలిట రాక్షసుడిగా తయారయ్యాడని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజమెత్తారు. టీడీపీ పాలనలో మహిళలకు చెప్పుకొదగ్గ ఒక్క పథకం కూడా అమలు చేయలేదని, కోడలు మగ బిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అంటూ మహిళలను కించపరుస్తూ పలుమార్లు చంద్రబాబు వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. బుధవారం సిరిపురంలోని తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో వడ్డీ లేని రుణాలు ఇస్తానని అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు మోసం చేశారన్నారు. గర్భిణులకు రూ.10వేలు, ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు ఇస్తానన్న చంద్రబాబు ఒక్కరికైనా చెల్లించారా? అని ఆమె ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 44 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు అమ్మఒడి, 80 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఆసరా ఇచ్చి ఆదుకున్న మనసున్న నాయకుడు సీఎం జగనన్న అని కొనియాడారు. టీడీపీ అధికారంలో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి ఎగ్గొడితే.. జగనన్న రూ.25,500 కోట్ల రుణాలను ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా చెల్లించి ఆదుకున్నారని గుర్తు చేశారు. మహిళల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల ఇళ్లను మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జగనన్న చేయూత, జగనన్న తోడు వంటి పథకాల ద్వారా మహిళా పక్షపాతిగా జగనన్న ప్రభుత్వం నిలిచిందన్నారు.

అది మేనిఫెస్టో కాదు.. మాయా ఫెస్టో

అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే చంద్రబాబు అని.. చీటింగ్‌కు కేరాఫ్ అడ్రస్ టీడీపీ అని ఎమ్మెల్సీ కల్యాణి మండిపడ్డారు. 2014 మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో నుంచి తొలగించిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు ప్రజలను మాయా చేసేందుకు మినీ మేనిఫెస్టో అంటూ వస్తున్నారన్నారు. ఈ మేనిఫెస్టోలో అన్నీ కాపీ పేస్ట్ పథకాలే అని.. అది మేనిఫెస్టో కాదు మాయా ఫెస్టో ఆమె ఎద్దేవ చేశారు. టీడీపీ చెప్పిన సూపర్ సిక్స్‌లో మూడు పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తుందన్నారు. టీడీపీకి ఇవ్వే చివరి ఎన్నికలు.. ఇదే చివరి మేనిఫెస్టో..ఇవే చివరి అబద్ధాలు కూడా అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎంత మభ్యపెట్టాలని చూసినా రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలంతా జగనన్నకు జై కొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

దర్శనానికి వచ్చి ఉంగరం దొంగిలిస్తారా..?

- సింహగిరిపై భక్తులను ప్రశ్నించిన అర్చకులు
- దొంగిలించలేదంటూ కన్నీటిపర్యంతమైన భక్తులు
- చివరికి వినోదోత్సవమని తెలుసుకుని సంభ్రమాశ్చర్యం
- నవ్వుల సందడిగా జరిగిన వినోదోత్సవం


దేవస్థానం అర్చకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విజయనగరానికి చెందిన భక్తురాలు


స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ప్రశ్నించడంతో భయభ్రాంతులు చెందుతున్న ఆరిలోవకి చెందిన నూతన దంపతులు


రాజయ అలంకరణలో అప్పన్న

సింహాచలం: 'శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి వచ్చి ఆయన ఉంగరాన్నే దొంగిలిస్తారా? మర్యాదగా దొంగిలించిన ఉంగరాన్ని ఇచ్చేయండి.. లేదంటే పోలీసులకు అప్పగిస్తాం..'అని సింహాచలం కొండకి వచ్చిన పలువురు భక్తులను దేవస్థానం స్థానాచార్యులు ప్రశ్నించే సరికి వారంతా కంగుతిన్నారు. 'మేం దొంగల్లా కనిపిస్తున్నామా.! స్వామి దర్శనానికి వస్తే ఉంగరాన్ని దొంగతనం చేశారంటారేంటి? పైగా తాళ్లతో బంధించి తీసుకొస్తారా..'అంటూ భక్తులు ఆవేశంతో స్థానాచార్యులపై గర్జించారు. 'చూడండీ.. మీరు దొంగతనం చేసినట్లు మా దగ్గర ఆధారాలున్నాయి. పోలీసులు తీసుకెళ్లకముందే దొంగిలించిన ఉంగరాన్ని మర్యాదగా ఇచ్చేయండి.' అంటూ స్థానాచార్యులు మరింత గర్జించి అడగటంతో భక్తుల కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి. తాము ఉంగరం తీయలేదని ఎంత చెబుతున్నా వినకుండా మీరే దొంగ అంటూ పదే పదే ప్రశ్నించడంతో వారంతా ఆగ్రహంతో చిందులు వేశారు. పైగా చేతికున్న ఉంగరాలను చూపెట్టమని.. దొంగిలించిన ఉంగరంలా ఇవి ఉన్నాయంటూ స్థానాచార్యులు అడగటంతో భక్తుల నోటి మాట రాలేదు. చివరికి ఇదంతా వినోదోత్సవంలోని ఘట్టమని తెలుసుకుని భక్తులంతా సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. తమకు మాత్రమే దక్కిన భాగ్యంగా భావించి ఆనందభరితులయ్యారు. ఇదీ సింహగిరిపై బుధవారం నవ్వుల సందడిగా జరిగిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి వినోదోత్సవం. స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన మృగయోత్సవంలో పోయిన ఉంగరం వెతికే ఘట్టాన్ని బుధవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించారు.

ఏడు పరదాల్లో దాగి ఉన్న స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజగోపురం వద్ద పల్లకీలో అధిష్టింపజేశారు. స్వామి దూతగా పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కర్ర, తాడు పట్టుకుని దర్శనానికి వచ్చిన పలువురు భక్తులను ఉంగరం దొంగిలించారంటూ తాళ్లతో బంధించి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ దొంగిలించిన ఉంగరాన్ని ఇవ్వాలంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్సవం గురించి తెలియని వాళ్లు కన్నీటిపర్యంతం చెందారు. ఉత్సవం గురించి తెలిసిన వాళ్లు నవ్వుతూ సమాధానం చెప్పారు. ఈ తరుణంలోనే స్వామిపై ఉన్న ఒక్కొక్క పరదాను తొలగించారు. చివరికి స్వామి చివరి పరదాలోనే ఉంగరం దొరికింది.

ఎస్.కోట మండలం బొద్దాంకి చెందిన నూతన దంపతులు ఈశ్వరరావు, మాధవి, ఆరిలోవ ప్రాంతానికి చెందిన మౌళి, గౌతమి, ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు హిమజ, ప్రత్యూష, లావణ్య, శ్వేత అశ్విని, టెక్కలికి చెందిన అక్కాతమ్ముళ్లు జీవిత, నవీన్‌కుమార్‌లను పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాళ్లతో బంధించి తీసుకురాగా వారిని స్థానాచార్యులు ప్రశ్నించారు. విజయనగరం జిల్లా దాసన్నపేటకి చెందిన రోజా అనే మహిళ తన కుమార్తె మిక్కి, అల్లుడు కిశోర్, మనవలతో కలిసి సింహగిరికి రాగా వారిని తాళ్లతో బంధించారు. వాళ్ల చేతికి ఉన్న ఉంగరం.. దొంగిలించిన ఉంగరంగానే ఉందని స్థానాచార్యులు, అర్చకులు అనుమానం వ్యక్తం చేయడంతో వారంతా వాదనకు దిగారు. నా కూతురుకు, అల్లుడికి నిశ్చితార్థం రోజు పెట్టిన ఉంగరాలు ఇవని, దొంగిలించినవి కాదని స్థానాచార్యులతో రోజా వాదించారు. ఇదిలా ఉండగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ఆలయ కొత్వాల్ నాయక్ లంక సూరిబాబు, ఆలయ ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు సైతం దొంగలుగా పట్టుపట్టారు. తొలుత స్థానాచార్యులను కూడా తాళ్లతోనే బంధించి తీసుకురావడం విశేషం. అదే సమయంలో సింహగిరి వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వినోదోత్సవంలో పాల్గొని.. స్వామిని దర్శించుకున్నారు.


టెక్కలికి చెందిన భక్తులను ప్రశ్నిస్తున్న స్థానాచార్యులు


ఈవోని తాళ్లతో బంధించిన పురోహిత్ అలంకారి


దొరికిన ఉంగరాన్ని చూపిస్తున్న పురోహిత్ అలంకారి

విశాఖ చేరుకున్న ఎన్నికల పరిశీలకులు

మహారాణిపేట : ఎన్నికల నిర్వహణ నిమిత్తం జిల్లాకు నియమితులైన పరిశీలకులు బుధవారం విశాఖ చేరుకున్నారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అమిత్ శర్మ, అనుసంధాన అధికారి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు, పరిశీలకులు సీనియర్ ఐపీఎస్ అధికారి అమిత్ కుమార్, అనుసంధాన అధికారి రిజర్వ్ పోలీసు శాఖ ఎస్ఐ ఎస్.కె.నజీరుద్దీన్, వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి ఎస్.రంగరాజన్, అనుసంధాన అధికారి జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ గణపతి తదితరులు వచ్చారు. వీరికి నోవాటెల్ హోటల్లో వసతి కల్పించారు. ఎన్నికల సంబంధిత వివరాల కోసం వారిని సంప్రదించవచ్చని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.

అసెంబ్లీ పరిశీలకులు

జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు కూడా జిల్లాకు చేరుకున్నారు. భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణం, ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా సీనియర్ ఐఏఎస్ అధికారి అమిత్ శర్మ, అనుసంధాన అధికారిగా డీఎస్‌వో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ వి.కె.చైతన్య, భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణ అసెంబ్లీలకు వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి సౌమ్య పాండే జైన్, అనుసంధాన అధికారిగా జీవీఎంసీ జోన్–5 సూపరింటెండెంట్ టీఎస్ఎన్ రాజు, విశాఖ ఉత్తర, పశ్చిమ, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి అక్తా జైన్‌బి, అనుసంధాన అధికారిగా ఆడిట్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఎ.రవికుమార్ పాత్రో, ఎస్.కోట, విశాఖ పశ్చిమ, గాజువాక అసెంబ్లీలకు సాధారణ పరిశీలకుడిగా ఐఏఎస్ అధికారి సీతారామ్ జాట్, అనుసంధాన అధికారిగా కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ కె.హరితేజ బుధవారం విశాఖ చేరుకున్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఝాన్సీ, ముత్తంశెట్టి

పద్మనాభం: మండలంలోని రెండు పంచాయతీలకు సంబంధించి టీడీపీకి చెందిన 350 మంది బుధవారం భీమునిపట్నంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన పాండ్రంగి – 2 ఎంపీటీసీ సభ్యురాలు పాలూరి సంతోషి, పాలూరి స్వామినాయుడు, పాండ్రంగి ఉప సర్పంచ్ శనపతి పైడిరాజు, శనపతి రామునాయుడు తమ అనుచరులు 300 మందితో, నేరెళ్లవలస పంచాయతీ వార్డు మెంబర్ సారిక జయరాం తమ అనుచరులు 50 మందితో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వీరు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు వైఎస్సార్ సీపీ నాయకులు పల్లి మహేష్, కొయ్య సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మురళీనగర్: ఈ నెల 27న నిర్వహించనున్న పాలిసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.నారాయణరావు తెలిపారు. విశాఖ నగరంలో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,511 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రం లోనికి అనుమతించబోరని స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్ టికెట్, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ ఇంక్ పెన్, ఎరేజర్ తీసుకు రావాలన్నారు.

రైల్వేస్టేషన్‌లో 'ఎకానమీ మీల్స్'

తాటిచెట్లపాలెం: రైల్వే ప్రయాణికులకు ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తక్కువ ఖర్చుకే అందించేందుకు దేశవ్యాప్తంగా భారతీయ రైల్వే, ఐఆర్‌సీటీసీతో కలిసి 'ఎకానమీ మీల్స్', 'స్నాక్ మీల్స్'లను పరిచయం చేసింది. దీనిలో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం ఈ స్టాళ్లను ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేకంగా జనరల్ కోచ్‌ల్లో ప్రయాణించే వారి కోసం ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులకు రెండు రకాల మీల్స్ అందుబాటులో ఉంచుతున్నారు. ఎకానమీ మీల్స్ రూ.20కు, స్నాక్ మీల్స్ రూ.50కు అందజేస్తున్నారు. ఈ సదుపాయాన్ని భారతీయ రైల్వేలోని 100 స్టేషన్లలో పరిచయం చేయగా.. ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ స్టేషన్లలో అందుబాటులోకి తీసుకువచ్చారు. జనరల్ ప్రయాణికులకు వారి ప్రయాణ సమయంలో చేరువగా మీల్స్ కౌంటర్లను ఏర్పాటు చేశామని, వీటిని వినియోగించుకోవాలని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ కోరారు. వీటితోపాటు వాల్తేర్ డివిజన్ రైల్వే ప్రయాణికులకు తాగునీరు, మజ్జిగ వంటివి అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలకు కూడా అవకాశం కల్పిస్తున్నారు.


శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, అఖిల భారత సెక్రటరీ జనరల్ మిలింద్ శ్రీకాంత్ పరాందే జి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. - సింహాచలం

వంశీకృష్ణపై 8 కేసులు

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కి చరాస్తులు రూ.7,41,04,298, స్థిరాస్తులు రూ.4,73,95,450, రుణాలు రూ.2,01,20,619 ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే తన వద్ద (క్యాష్ ఇన్ హ్యాండ్) రూ.68,490, తన భార్య వద్ద రూ.12,500, కుమారుడు వద్ద రూ.40 వేలు ఉన్నట్టు తెలిపారు. భార్య పద్మజ పేరిట రూ.32,435 చరాస్తులు, కుమారుడి పేరిట రూ.18,58,485గా చూపారు. స్థిరాస్తులుగా కుమారుడి పేరిట రూ.1,17,62,000 చూపారు. వంశీకృష్ణపై 8 కేసులు ఉన్నాయి.

పలు రైళ్ల దారి మళ్లింపు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం వాల్తేర్ డివిజన్ పరిధిలో రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

విజయనగరం–రాయగడ–రాయ్‌పూర్–నాగ్‌పూర్ మీదుగా మళ్లించిన రైళ్లు

ఈ నెల 28వ నుంచి మే 9వ వరకు, మే 15వ నుంచి 21వ వరకు విశాఖ–న్యూఢిల్లీ (20805) ఏపీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28 నుంచి మే 9 వరకు, మే 15నుంచి 21వ న్యూఢిల్లీ –విశాఖ(20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ , మే 2, 9, 16వ తేదీల్లో బయల్దేరే విశాఖ–గాంధీదాం(20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28, మే 5,9వ తేదీల్లో బయల్దేరే గాంధీదాం–విశాఖ(20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28, మే 5,19వ తేదీల్లో బయల్దేరే పూరి – ఓఖా (20819) ఎక్స్‌ప్రెస్, మే 1,8,15వ తేదీల్లో బయల్దేరే ఓఖా–పూరి(20820) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, మే 3,6,10,17,20వ తేదీల్లో బయల్దేరే విశాఖ– హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28, మే 1,5,8,15,19వ తేదీల్లో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్ – విశాఖ (12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్.

వయా విజయవాడ–గుంటూరు–పగిడిపల్లి మీదుగా..

ఈ నెల 28 నుంచి మే 9వ వరకు, 15 నుంచి 21 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ– లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28 నుండి మే 9 వరకు, 15 నుంచి 21 వరకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయల్దేరే లోకమాన్య తిలక్ టెర్మినస్ – విశాఖ (18520) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ , మే 2,3,8,9,21,22వ తేదీల్లో షాలిమర్‌లో బయల్దేరే షాలిమర్– హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మే 3,4,9,10,21,22వ తేదీల్లో హైదరాబాద్‌లో బయల్దేరే హైదరాబాద్– షాలిమర్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మే21న సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్ – షాలిమర్ (12774) ఎక్స్‌ప్రెస్, మే 2,3,8,9,20,21వ తేదీల్లో సీఎస్‌టీ ముంబయిలో బయల్దేరే సీఎస్‌టీ ముంబయి– భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మే 2,3,8,9,20,21వ తేదీల్లో భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్– సీఎస్‌టీ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, మే 6,20వ తేదీల్లో సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్ – షాలిమర్ (07225) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30, మే 7,21వ తేదీల్లో షాలిమర్‌లో బయల్దేరే షాలిమర్ –సికింద్రాబాద్ (07226) ఎక్స్‌ప్రెస్, మే 8న షాలిమర్‌లో బయల్దేరే షాలిమర్ – సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్, మే 10న సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్ – షాలిమర్ (22850) ఎక్స్‌ప్రెస్

వయా విజయవాడ–గుంటూరు–నంద్యాల–గుంతకల్–బళ్లారి మీదుగా మే 5,19వ తేదీలలో యశ్వంత్‌పూర్‌లో బయల్దేరే యశ్వంత్‌పూర్ –టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ నడపనున్నారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు...

మే 7,16,18,21వ తేదీల్లో బయల్దేరే విశాఖ–సికింద్రాబాద్–విశాఖ (20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా 30 నిమిషాలు,మే 4,10,22వ తేదీల్లో బయల్దేరే విశాఖ– సికింద్రాబాద్– విశాఖ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా గంటన్నర ఆలస్యంగా బయల్దేరుతాయి.

మధిరలో స్టాప్ తొలగింపు...

మే 9 నుంచి 20 వరకు భువనేశ్వర్–సీఎస్‌టీ ముంబయి (11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మే 9నుంచి 21 వరకు విశాఖ–మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్‌లకు మధిరలో హాల్టులను తొలగించారు.